క్లుప్తంగా

ఆర్థిక సాయం


యువతి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఓ యువతి వివాహానికి మన ఊరు–మనగుడి, మన బాధ్యత సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ మన ఊరు–మనగుడి సభ్యురాలైన లక్ష్మీదేవమ్మ మనవరాలి పెళ్లి నిమిత్తం సభ్యుల సహకారంతో రూ.40వేలు నగదు, చీరలు, బ్యాగ్‌లు, తదితర వస్తువులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, హరికిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్యసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళా వేదికపై గుంటూరుకు చెందిన తిరుమల అర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, శివాష్టకం, శివ స్తుతి, లింగాష్టకం, చంద్రశేఖరాష్టకం, శివపంచాక్షరి తదితర గీతాలకు, అష్టకాలకు గీతిక, భవ్య, భవ్యశ్రీ, తులసి, అక్షర, దుర్గ, లీల తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా ప్లాస్టిక్ కప్పులు, కవర్లు నిషేధించాలని ఆలయ అధికారులు ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని గురువారం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు మహానంది దేవస్థానం అధికారులు ఆలయ ప్రాంగణాల్లో వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారికి సూచనలు జారీ చేశారు. ప్లాస్టిక్ కప్పులు, ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధించాలన్నారు. ఆలయాలు ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా ఉండేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు సీనియర్ ఉద్యోగులను నోడల్ అధికారులుగా నియమించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్య లు తీసుకోవాలని కోరారు. ప్రసాదాలను పేపర్ సంచుల్లో అందించాలని, భక్తులకు వడ్డించే అన్న ప్రసాదాన్ని అరిటాకులు లేదా స్టీల్ ప్లేట్లలో పంపిణీ చేయాలన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ


స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, రింగ్ రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్ప కొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


నంద్యాలలో కాళ్లకు పసుపు పూస్తున్న దృశ్యం.


వాసాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి హారతి


దొర్నిపాడులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


ప్రత్యేక అలంకారంలో కాశీవిశాలాక్షి


ఆర్.జంబులదిన్నె చౌడేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మంగళస్నానాలు ఆచరించి వరలక్ష్మి అమ్మవారి ప్రతిమను పూజించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, వాయినాలుగా ఇస్తూ ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక కాళికాంబదేవస్థానంలో వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేదపండితులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఒడి బియ్యం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు ఆరవేటి వాసు దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీకాశీమాత సేవా సమాజ్ సభ్యులు, మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలను వాయినాలుగా పంపిణీ చేశారు. స్థానిక శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించి కుబేర హోమం చేపట్టారు. స్థానిక నిమిషాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోటవీధిలోని శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఈఓ మోహన్ ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె, సుద్దమల్ల, హరివరం, బోడెమ్మనూరు, ఇంజేడు, మాయలూరు గ్రామాల్లో వెలిసిన చౌడేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పణ చేసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు అందజేశారు. అర్చకులు లక్ష్మణస్వామి, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శుభాలు కలగాలని..

దొర్నిపాడు: మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. కుటుంబ శ్రేయస్సు కోసం, సకల శుభాలు కలగాలని మహిళలు రోజంతా ఉపవాసం ఉండి ఈవ్రతం చేశారు. సౌభాగ్యలక్ష్మిని ఆహ్వానించడానికి అమ్మవారి ప్రతిమలను తయారు చేసి పిండివంటలు, నూతన చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా జరిగింది. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల, మహదేవపురం, వీరారెడ్డిపల్లె, కోటపాడు, వెంకటాపురంలలో మహిళలు భక్తి శ్రద్దలతో సాముహిక వ్రతం ఆచరించారు. ఆలయాల పూజలు వ్రతం విశిష్టతను వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది.

రుద్రవరం: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం భక్తి శ్రద్దలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి, అప్పనపల్లె దారి లోని వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. తమ నోములు తీర్చాలని, అంతా మంచి జరగాలని అమ్మవారికి విశేష పూజలు చేశారు.

జగజ్జననీ నమోస్తుతే

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో శ్రీ అమృతవల్లీ అమ్మవారికి ఉదయం నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తి అమ్మవారిని కొలువుంచి నవకలశ స్థాపన చేశారు. పంచామృతాలతో అభిషేచించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి అమృతవల్లీ అమ్మవారిని వరలక్ష్మి అమ్మవారిగా అలంకరించి వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్తయిదువల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి అమ్మవారికి మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. తిరిగి దేవాలయం చేరుకున్న అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలు ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో జరిగాయి.

నేడు విద్యుత్ కోతలు

నంద్యాల(న్యూటౌన్): మరమ్మతు పనుల నేపథ్యంలో డీ2 పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, నూనెపల్లె, సాధిక్‌నగర్, సాయిబాబానగర్, దేవనగర్, విశ్వనగర్, విద్యానగర్, టెక్కె, సుద్దులపేట, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లోని వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల పరిధిలోని విద్యుత్ లైన్లలో మెయింటెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆళ్లగడ్డ, పడకండ్ల, ఆర్‌కృష్ణాపురం, బాచేపల్లి, అహోబిలం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని వ్యవసాయ, ఇండస్ట్రీయల్, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వే గేటు వద్ద మరమ్మతులు

- ఆగిపోయిన వాహనాలు

మహానంది: గాజులపల్లి రైల్వే స్టేషన్ గేటు వద్ద గేటు తీగలు దెబ్బతినడంతో శుక్రవారం కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. గిద్దలూరు నుంచి మహానంది మీదుగా ప్రయాణిస్తున్న వాహనాల రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టడంతో కొద్దిసేపు అనంతరం యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.

అన్న ప్రసాద పథకానికి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్ నగరానికి చెందిన చావలి అనురాధ శుక్రవారం రూ.10 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. దాతకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు.

జిల్లాలో యూరియా కొరత తీర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల (న్యూటౌన్): జిల్లాలో యూరియా కొరతను నివారించి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సీపీఐ మహాసభలు పూర్తి చేసుకొని రాష్ట్ర మహాసభలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బిహార్ ఎన్నికల్లో పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని, ఎన్నికల కమిషన్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించి అక్కడ విలువైన సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఆరోపించారు. జిల్లాలో రైతులు యూరియాతో ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం యూరియా కష్టాలు తీర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, నాయకులు ప్రసాద్, మోటా రాముడు, రమేష్, సుంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాల్వ కాదు..సీసీరోడ్డే


చిన్నకంబలూరులో సీసీరోడ్డుపై పారుతున్న నీరు

రుద్రవరం: ఈచిత్రంలో కనిపిస్తున్న నీటిని చూసి పంట కాల్వ అనుకుంటే పొరబడినట్టే. ఇది రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామంలోని ఓ సీసీ రోడ్డు. ప్రస్తుతం కురుస్తున్న వానలకు తోడు తెలుగుగంగ కాల్వ ద్వారా పారే నీరు ఎగువనున్న పొలాల్లో నుంచి దిగువనున్న ఈ రోడ్డుపైకి చేరుతుంది. ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లేందుకు లేకపోవడంతో ఇళ్ల ముందే నిలిచిపోయి కాలువను తలపిస్తుంది. నీటి నిల్వతో దోమల బెడద పెరిగి తాము రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాల్వలు బాగు చేయించి నీరు బయటకు పారేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మరకత లింగేశ్వర స్వామికి హరిద్రాభిషేకం

- నేడు మహాలక్ష్మీ యాగం


పూజలందుకున్న మరకత లింగేశ్వరుడు

మహానంది: గాజులపల్లె రైల్వే స్టేషన్ గ్రామంలో కొలువైన గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం, మూడవ శుక్రవారం సందర్భంగా వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అర్చకులు మరకతలింగేశ్వర స్వామికి 100 కిలోల పసుపుతో హరిద్రాభిషేకం నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాన్ని తిలకించారు. శనివారం నవగ్రహ ఆలయాల వద్ద మహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కనమర్లపూడి తెలిపారు.


యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు, అర్చకులు

కామేశ్వరీ దేవికి పసుపు కొమ్ములతో అలంకరణ

మహానంది: శ్రావణమాసం, మూడవ శుక్రవారం సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, అర్చకుల బృందం 250 కిలోల పసుపు కొమ్ములతో దండలు తయారు చేసి అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా కరాటే మహబూబ్‌బాషాను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ యూసుప్, రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ సయ్యద్‌గులాబ్, జిల్లా గౌరవాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, యూసుఫ్‌లు మాట్లాడుతూ ముస్లిం హక్కుల పోరాట సమితి సంఘాన్ని బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలన్నారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలి


ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పౌరసత్వ చట్ట సవరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు అన్నారు. స్థానిక పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమన్నారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయని, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ, ఎన్నికల సంఘం హోంమంత్రి ఆదేశాలతో ఓటర్ల లిస్టును మర్చేసి లక్షలాది మందికి ఓటు హక్కును దూరం చేస్తుందన్నారు. బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. విదేశీ ఓటర్లు ఉన్నారంటూ పెద్ద ఎత్తున మతతత్వ శక్తులు ప్రచారం చేస్తున్నాయని, వీటిని తిప్పికొట్టాలన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు.

అనుబంధాల రాఖీ

- నేడు రక్షాబంధన్
- ప్రేమానురాగాలకు ప్రతీక ఈ వేడుక

నంద్యాల(వ్యవసాయం): అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల అనురాగం, ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్. తోబుట్టువులు మధ్య అనుబంధాల పూలు పూయించే వేడుక ఇది. నేడు శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సోదర సమానులకు రాఖీ కట్టేందుకు సోదరీమణులు సిద్ధమవుతున్నారు.ఈనేపథ్యంలో ఇప్పటికే నంద్యాల పట్టణంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులతో రాఖీలు యువతను చూడగానే ఆకట్టుకుంటున్నాయి. కొందరు సోదరుడి పేరు, ఫోటోలతో రాఖీలు తయారు చేస్తున్నారు. అలాగే రుద్రాక్షలు, వివిధ రకాల విత్తనాలు, దేవుడి బొమ్మలు, బ్రేస్‌లెట్ రాఖీలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే రాఖీలు రూ. 20 మొదలు కొని రూ. 1000 వరకు ధరలు పలుకుతున్నాయి.


అమ్మకానికి ఉంచిన రాఖీలు


రాఖీలను కొనుగోలు చేస్తున్న యువతులు

చౌడేశ్వరీ దేవికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం చౌడేశ్వరీ దేవికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


నీటిలో చిన్నారులను బడికి తీసుకెళ్తున్న దృశ్యం

నిర్లక్ష్యం పారుతోంది

దొర్నిపాడు: ఇలా పారే నీటిలో నడుచుకుంటూ వెళ్లడం నిత్యకృత్యం. నాలుగు దశాబాల నుంచి నెలకొన్న సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. పాలకులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మండల కేంద్రం దొర్నిపాడులోని హరిజనవాడ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటకాలువ నీరు నిత్యం ఈ కాలనీలోని ఇళ్ల ముందర ప్రవహిస్తోంది. కల్వర్టుకు వేసిన పైపులు పూర్తిగా మట్టితో నిండిపోవడంతో రోడ్డుపై నీళ్ల ప్రవహిస్తున్నాయి. చిన్నారులను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితి. ఎక్కడ నీటిలో కొట్టుకుపోతారోనని కాపలా కాయాల్సి వస్తుంది. దీనికితోడు రాత్రివేళల్లో దోమలతో పాటు నీటిలో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురిపించి..ముఖం చాటేసి

- వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- వర్షాభావంతో తగ్గిన ఖరీఫ్ సాగు

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్‌కు ముందే మోస్తరు వర్షాలతో మురిపించిన వరుణుడు తీరా ముఖం చాటేశాడు. ఎన్నో ఆశలతో పంట సాగుకు సిద్ధమైన రైతులు అదును దాటిపోతుందని ..ముందస్తు వానలకు విత్తు వేసిన రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతేడాది రైతులకు కలిసి రాలేదు. ఈసారైనా వాతావరణం అనుకూలిస్తుందనుకుంటే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన పంటలకు ఇప్పటికే అదును దాటిపోయింది. ఖరీఫ్ పంటల సాగు కోసం పొలాలను దుక్కిదున్ని వరుణుడి కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలు ఎదుగుదల లేక నిలిచిపోయాయి. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,975 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 5,89 హెక్టార్లలో మాత్రమే రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేశారు. మొక్కజొన్న 338 హెక్టార్లు, మినుము 56, పత్తి 35, వరి 131, పెసర 8, కంది 5, సోయాబీన్ 8, వేరు శనగ 8 హెక్టార్లలో పంటలు వేశారు. ఆగస్టు నెల ప్రారంభమై వారం రోజులు గడిచినా వర్షాలు రాకపోవడంతో ముందుగానే కొనుగోలు చేసిన విత్తనాలు పొలంలో వేయాలా లేదా బయట మార్కెట్‌లో అమ్మివేసి బతుకుదెరువు కోసం వలస వెళ్లాలనా అని రైతులు మదన పడుతున్నారు.

ఈ ఏడాది తొలకరి వర్షాలు మురిపించాయి. మే నెలలో సాధారణ వర్షపాతం 36 ఎంఎం కాగా 156 ఎంఎం వర్షం కురిసింది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 63 ఎంఎం కాగా 56.4 ఎంఎం, జూలైలో 119 ఎంఎంకు 73 ఎంఎం కురిసింది. ఆగస్టులో 165 ఎంఎం కాగా ఇప్పటి వరకు 31 ఎంఎం వర్షపాతం నమోదైంది. మండలంలో ఎక్కువ శాతం మెట్ట భూములు కావడంతో రైతులు వర్షంపై ఆధారపడి ఉన్నారు. పదునైన వర్షం కురిస్తే తప్పా పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం లేదు. సాగు విస్తీర్ణం తగ్గడంపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం ప్రశ్నించగా ఖరీఫ్‌సాగుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు వుంది. పదునైన వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు.


బోడెమ్మనూరు గ్రామ సమీపంలో ఎదుగుదల లేక నిలిచిన వేరుశనగ